




*(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)*

ధగ ధగా మెరుస్తున్న లైట్ల కాంతిలో హొటెల్ పెద్ద మహారాజ భవనంలా మిల మిలా మెరుస్తోంది.

వచ్చే, పోయే కార్లతోనూ, మెయిన్ డోర్ దగ్గర దిగి లోపలకి నడుస్తున్న అతిథులతోనూ, వారి డిజైనర్ బట్టల తళుకులతోనూ, గుమ్మిగా కొట్టుకున్న సెంటు పరిమళాలతోనూ నిండిపోయింది.

చాలా వైభవంగా, సందడిగా జరిగింది పార్టీ.

స్నేహితులనీ, వారి కుటుంబాలనీ కలిసిన ఆనందంతో కేశవరావు కుటుంబం తిరిగి ఇంటికి బయలుదేరేసరికే రాత్రి పదకొండు దాటింది.

కార్ లో మిగిలిన ముగ్గురూ, ముఖ్యంగా చిన్న వాళ్ళిద్దరూ ఆధునికంగా, అందంగా జరిగిన వేడుకలనీ, అలంకరణలనీ, భోజనాలనీ మెచ్చుకుంటూ మాట్లాడుకుంటూ ఉంటే దారిపొడుగునా, ఇంటికి వచ్చాకా కూడా యశోద ఎంగేజ్ మెంట్ గురించే మాట్లాడుతూ ఉండిపోయింది.

ఆమె కళ్ళల్లో అందమైన గులాబీ రంగు బట్టల్లో కాబోయే పెళ్ళికూతురిగా తన కూతురే కనబడసాగింది.

"మన యామిని కూడా పెళ్ళి కూతురైతే ఎంత బావుంటుందో! నాకా రోజు ఎంత తొందరగా వస్తుందా? అని ఎంత ఆత్రుతగా ఉందో!" అంటూ రెండు సార్లు భర్త చెవిలో కాస్త మెల్లగానూ, రెండు మూడు సార్లు గట్టిగానూ అంది కూడా.

" అమ్మా! నేను మీ ఇద్దరికీ ముందే చెప్పాను కదా, నా పి.హెచ్ డీ అయ్యేవరకూ పెళ్ళి మాట లేనే లేదు అని" అంది యామిని కాస్త కోపంగా.

ఆ మాట తను ఎప్పుడు మొదలు పెట్టినా అది ఇద్దరిమధ్యనా చిన్న వాదనలోకి దిగడం తప్పదు కనక యశోద సంభాషణని మరింత పొడిగించకుండా అంతటితో ఆపేసింది.

కానీ అప్రసన్నంగా మారిన ఆమె ముఖకవళికలని యామిని గమనించినా, చూడనట్టుగా తలని కిటికీవైపుకి తిప్పుకుని బయటకి చూడటం మొదలు పెట్టింది.

ఆమెకి మొదటినించీ చదువంటే పంచప్రాణాలు.

ఆమె చేస్తున్న డాక్టరేట్ ప్రోగ్రాం పూర్తి అయితే కానీ మరే ఇతర పని మీదకు దృష్టి మళ్ళకూడదని ఆమె అభిప్రాయం, స్థిర నిశ్చయం. దానికి వ్యతిరేకంగా ఎవరేం మాట్లాడినా, ప్రవర్తించినా ఆమెకి వెంటనే కోపం వచ్చేస్తుంది.

ఆమె ముభావాన్ని చూసి భార్య ముఖంలో తొణికిసలాడుతున్న బాధావీచికలని చూసి నెమ్మదిగా కేశవరావ్ ముందు సీట్ వైపుకు చెయ్యి చాచి కూతురిభుజం మీద మెత్తగా తడుతూ..

" నీ పి హెచ్ డీ అయ్యే వరకూ వద్దులే కానీ మీ అమ్మ అన్న మాటలో అబద్ధం లేదు కదమ్మా! ఏ వయసులో జరిగే ముచ్చట ఆ వయసులో జరిగితే బావుంటుంది కదా!" అన్నాడు నెమ్మదిగా.

" నాన్నా, మీరు కూడానా!" విసుగూ, చిరకూ ధ్వనిస్తున్న గొంతుతో చిరాకు పడింది యామిని.

"అవును యామ్స్! అమ్మా, నాన్నల మాటే నా మాట కూడా" చెల్లిని ఉడికిస్తూ మొదలుపెట్టాడు యష్ కూడా.

యామిని ఏం మాట్లాడలేదు. " స్టాప్ ఇట్ యష్" అంది కోపంగా.

వాతావరణాన్ని తేలికపరచడానికి కేశవరావ్ ఏదో పార్టీ జోక్ చెప్పి అందరి మూడ్ మార్చారు.

మళ్ళీ నవ్వులు చిందిస్తూ కార్ ఇల్లు చేరింది.

పిల్లల ఇష్టాలకి వ్యతిరేకంగా ఏపనీ చెయ్యరు వాళ్ళిద్దరూ.

నిద్రకుపక్రమిస్తూ మళ్ళీ భర్తతో అదే విషయాన్ని కదిపింది యశోద.

“నువ్వన్నది నిజమే యశూ! మన పిల్లలిద్దరూ మంచి ఉద్యోగాలు చేసుకుంటూ, చక్కటి జీవిత భాగస్వాములతోనూ, పిల్లలతోనూ వారి జీవితాల్లో సుఖం గా ఉండాలని మనం కోరుకోవడం ఎంత సమంజసమో, వారి అభిప్రాయాలని గౌరవిస్తూ సరైన సమయానికి ఈ కార్యక్రమాలు జరిపించడం కూడా సముచితం కదా. ప్రస్తుతం యామీ చాలా క్రిటికల్ ప్రయోగాలు చేస్తోంది, అవి తన డాక్టరేట్ థీసిస్ కి చాలా ముఖ్యం, ఆ రిజల్ట్స్ తను అనుకున్నట్టుగా రావడం లేదని కొంత టెన్షన్ పడుతోంది ప్రస్తుతం. ఇలాంటి టైములో పెళ్ళి గురించి ప్రస్తావన కూడా తను ఇష్టపడదు. అందుకని కొంత కాలం ఆగి చూద్దాం. రాజీవ్ వాళ్ళు ఇప్పటికే అడిగాడు.వాళ్ళ అబ్బాయి రిషిల్ గురించి. యామి మనసు తెలిసిన తండ్రిగా నేను ఏమీ చెప్పలేకపోయాను. కొంత టైము కావాలి అన్నాను. సరి అయిన సమయం చూసి ‘తన మనసులో ఎవరైనా ఉన్నారా?’ అని కనుక్కుని, లేదంటే మనం సరి అయిన జోడీని వెతికి సంబరంగా పెళ్ళి చేద్దాం. ప్రస్తుతానికి పడుకో మరి, ఇప్పటికే చాలా లేట్ అయింది కదా.” అన్నాడాయాన భార్య చేతి గాజులు సవరిస్తూ.

భర్త మాటల్లోని నిజాన్ని కాదనలేక, తన మనసుని దాచుకోలేకా కాస్త అప్రసన్నంగానే పడుకుంది ఆవిడ.

వెంటనే నిద్రలోకి జారుకున్న ప్రసన్నమైన ఆమె ముఖాన్ని చూస్తూ తన వైపు లైట్ కూడా ఆర్పి ఆయన కూడా పడుకున్నారు.

-----------

మర్నాడు ఉదయం విపరీతమైన తల నొప్పితోనూ, దగ్గుతోనూ ఒక పట్టాన తన నిర్ణీత సమయానికి నిద్ర లేవలేక పోయింది యశోద.

దానికి తోడు భుజం నొప్పి మొదలైంది.

"ఒకేవైపే పడుకున్నానేమో రాత్రంతా, బాగా నొప్పి అంది అలసట నిండిన గొంతు గరగరమంటుంటే".

" ఔట్ డోర్ పార్టీలతో ఇదొక ప్రాబ్లెం. చాలా సేపు బయట చల్లగాలిలో గడిపావుకదా, అందుకని జలుబు చేసి ఇలా అయింది. ఈ రోజు ఎక్కడకీ వెళ్ళకుండా హాయిగా రెస్ట్ తీసుకో! ఏ పని అయినా రేపు తగ్గాకా చూసుకుందాం. నువ్వు ఓకే అంటేనే నేను లాబ్ కి వెళతాను, లేదంటే సాయంత్రం నాన్న వచ్చాకా అప్పుడు వెళ్ళి రాత్రికి వస్తాను" అంది యామిని అలసటగా కనిపిస్తున్న తల్లిని చూస్తూ.

కూతురి మాటలు పెద్దగా రుచించలేదు యశోదకి.

" కొద్దిగా అలసట, అంతే రా. నేను బానే ఉన్నాను. ఈ రోజు క్లైంట్ మీటింగ్ ఉంది కూడా. వాళ్ళకి డిజైన్లు చూపించాలి."

" ప్లీజ్ మా! ఒక్క రోజుకి నీ టీం ని వెళ్ళమను" అంది యామిని

"టీం ని పంపిచచ్చు,కనీ నేను వెళ్తే ఆ దారి వేరు. అయినా ఇప్పుడు నాకేమైంది? కాస్త జలుబుకే ఏమయిపోతుంది?" అంది ఆవిడ చిరుకోపంగా.

'నీ ఇష్టం' అన్నట్టు భుజాలెగరేసింది యామిని.

కూతురిన్ని చూసి నవ్వింది యశోద. " డ్రైవర్ ని తీసుకుని వెళతానులే, నేను డ్రైవ్ చెయ్యను" అంది చిరునవ్వుతో.

ఉదయపు అల్పాహారాలయ్యాకా ఒకటికి రెండుసార్లు అడిగి యశోద వెళ్ళడానికే నిశ్చయించుకుందని తెలిశాకా, తను ఆఫీస్ కి వెళ్ళాకా డ్రైవర్ రాజు ని పంపుతానని చెప్పాడు కేశవరావు.

మరొక డ్రైవర్ స్వామి శలవు కావాలని వెళ్ళాడు.

అందరూ ఎవరి పనుల మీద వారు వెళ్ళాకా తను కూడా త్వరగా తయారయింది.

చెయ్యి పైకెత్తి దువ్వెనతో దువ్వుకోబోతుంటే మళ్ళీ ఎడమవైపు భుజం మీంచి ఛాతీ దాకా తీవ్రమైన నొప్పి మొదలైంది. దాంతో తట్టుకోలేనట్లు చేతిలోని దువ్వెన నేలమీద పడేసి, పక్కనే ఉన్న సోఫా మీద కూర్చుండిపోయింది.

ఆమె పనులు ప్రత్యేకంగా చూసుకునే కరుణ " అమ్మా, ఏమైంది? అంటూ పరుగున వచ్చింది"

కొద్ది క్షణాలకే తేరుకుంది యశోద.

" కొంచెం నీళ్ళు ఇస్తావా కరుణా?" అని అడిగింది.

పరుగున వెళ్ళి గ్లాస్ నిండా చల్లటి నీళ్ళు తెచ్చి ఇచ్చింది కరుణ.

తాగిన రెండు నిమిషాలకి సర్దుకుంది ఆవిడ.

" ఎలా ఉందమ్మా? సార్ కి ఫోన్ చెయ్యనా?" అంటూ ఆత్రంగా అడిగింది కరుణ.

" అయ్యో, వద్దు కరుణా, ఎందుకో చెయ్యి కాస్త పట్టినట్టనిపిస్తోంది పొద్దున్నించీ. రాత్రి ఒక వైపే పడుకున్నానేమో, నా బరువుకే నా చెయ్యి నొప్పెట్టి ఉంటుంది" అంది ఆవిడ తేలికగా నవ్వుతూ.

అలా అంటూనే ఐదు నిమిషాలు ప్రాణాయమం చేసుకుంది.

తిరిగి ఊపిరి ఆడుతున్నట్టనిపించింది.

" చూశావా కరుణా, తగ్గిపోయింది" అంటూ నవ్వింది.

" పోనీ చేతినొప్పికి ఏదైనా బామ్ రాయమంటారా అమ్మా?" అని అడిగింది కరుణ.

"వద్దమ్మా, క్లైంట్ మీటింగ్ కి వెళ్తూ బామ్ వాసన వేస్తూ వెళితే బావుండదు. నీకు వీలైతే కాస్త నా జుట్టు వెనకకి దువ్వి పెట్టి, ఇంకా కొంత సేపు చెయ్యి లేచేటట్టు కనబడటం, లేదు" అంది అదే చిరునవ్వుతో.

" అలాగే అమ్మా!" అంటూ దువ్వెన తీసుకుని నెమ్మదిగా నున్నగా దువ్వి వెనక క్లిప్ పెట్టింది కరుణ.

" థాంక్ యూ కరుణా" అంటూ త్వరగా తయారయింది ఆవిడ.

" అయ్యో, ప్రతీ పనికీ థాంక్స్ చెప్తారెందుకమ్మా? ఇన్నేళ్ళబట్టీ మీ దగ్గర పనిచేస్తున్నాను. ఒక్కసారి కూడా మర్చిపోరు కదా!" అంది కరుణ.

" దాంట్లో ఏముంది కరుణమ్మా, నువ్వు నాకు చేసిన సాయమే కదా ఏపనైనా! సాయానికి థాంక్స్ చెప్పడం కూడా తప్పేనా?"" అంది ఆవిడ నవ్వుతూ.

" మీ మనసమ్మా అది. లేదంటే జీతం తీసుకుని పని చేసేవాళ్ళం మేము. మమ్మల్ని మీతో సమానంగా చూసుకుంటారు, ఏదీ కావాలి అని అడగకుండానే ఇస్తారు" అంటూ ఇంకా ఏదో చెప్పబోతుంటే ఆమెని మధ్యలోనే ఆపి

" సరే సరే, పదకొండయిపోతోంది, నువ్వొక్క కప్పు హెర్బల్ గ్రీన్ టీ ఇచ్చేస్తే బయలుదేరతాను. ఇస్తావా మరి?" అంటూ టాపిక్ మార్చింది ఆవిడ.

లేదంటే కరుణ కృతజ్ఞతల పురాణం కొనసాగుతూనే ఉంటుంది అని ఆవిడకి తెలుసు.

కరుణ ఇచ్చిన టీ తాగి, బయలుదేరేముందు కూడా ఇంకా కలుక్కుమంటున్న ఎడమ భుజాన్ని చూస్తూ 'ఒక వేళ హార్ట్ ఎటాక్ కాదు కాదు కదా' అనుకుంది.

అంతలోకే "చెమటలు లేవు, భుజం తప్ప మిగిలిన చెయ్యి అంతా నొప్పి లేదు. అందుకని భయపడక్కర్లేదు" అని తనకు తానే చెప్పుకుంది.

చక్కని వంగ పువ్వు రంగు కాటన్ చీర కట్టుకుని, దాని మీదకి చిన్న ప్రింట్ ఉన్న కలంకారీ జాకెట్ వేసుకుని. చెవులకి ఏడు రాళ్ళ డైమండ్ దుద్దులు, డైమండ్ పెండెంట్ ఉన్న నల్లపూసల గొలుసు వేసుకుని, నుదిటిన చిన్న ఎర్రటి బొట్టు పెట్టుకుంది.

ఒక చేతికి నాలుగు బంగారు గాజులు, మరొక చేతికి వాచీ పెట్టుకుని కరుణ ముందే సిద్ధంగా ఉంచిన హేండ్ బాగ్, తోట డిజైన్ల కాగితాలున్న పెద్ద కవరూ పట్టుకుని బయలుదేరింది.

" చాలా బావున్నారమ్మా!" అంది కరుణ ఆమె వైపు ఆరాధనాపూర్వకంగా చూస్తూ.

" థాంక్ యూ కరుణమ్మా!" అంటూనవ్వుతూ బయటకు నడిచింది.

ఈ పరుగు వచ్చే నెలదాకా

Post your comments